



శ్రీ ఆదుమిల్లి విశ్వనాథరావు

★

కొంతకాలంనించే శంకరానికి పార్వతికి మధ్య వాగ్వివాదాలు ప్రారంభమయినై. అసలు ఆ దంపతుల మధ్య ఇటువంటి తుఫాను ఎక్కడ వచ్చిందంటే, సంసారం యావత్తు సాక్షీగా వడిదుడుకులు లేకుండా నడుస్తున్నదీ అంటే దానికంతా తన గొప్పదనమే కారణమంటాడు శంకరం. అందుకు ఒక్కసారయినా కనీసం నవ్వుతాలుకయినా ఒప్పుకోనంటుంది పార్వతి. తాను పదహారేళ్ళు రాత్రి బవళ్ళు కష్టించి చదివి నానా అవస్థలుపడి నౌకరీ సంపాయించి, పై అధికారుల అడుగులకు మడుగులొగ్గుతూ వ్యక్తిత్వాన్ని చంపుకుని, బానిసత్వాన్ని జీర్ణించుకొని సంసారం గుట్టుగా సాగిపోవాలని తాపత్రయపడుతుంటే, అందుకు తనని అభినందించి పూజించాల్సింది. అట్టేపోగా, ఇందులో తన ప్రయోజకత్వం ఏముందని కట్టుకున్న పెళ్ళాం నిరసనచేస్తే ఏమగాడు సహిస్తాడు చెప్పండి! ఇక పార్వతి వాదన ఏమంటే, ఇద్దరు పిల్లల్ని సముదాయించుకుంటూ ఇరవైనాలుగు గంటలూ ఇంటి చాకిరీ అంతా తనదేనాయె, ఇందులో ఆయన తనకి కొంచమయినా సాయపడేదిలేదు. ఏడుస్తున్న పిల్లాడినయినా కొంచెం అటూఇటూ తిప్పి ఊరడించటం చాతకాదు. తను లేకపోతే కాస్త కాఫీ అయినా కాచుకు త్రాగే నేర్పులేదు. తను లేకపోతే ఒక్క రాత్రయినా ఆయనకు తోయ్యదు. ఆఫీసునించి సాయంకాలము చిరాకుతోటి, తలనొప్పితోటి ఇంటికి వేంచేస్తే, తను లేకపోతే ఆ రాత్రి నిద్రలేకా ఆ మర్నాడు పక్కనుంచి లేవలేక ఆయన పడే అవస్థ అటువంటి వాళ్ళకు మాత్రమే తెలియాలి. ఆయన ఉద్యోగంచేసి కుటుంబం పోషిస్తున్నారు, నిజమే. ఎవరికోసం? ఇదంతా నా ప్రయోజకత్వం నా గొప్పదనం అనుకుంటే ఎట్లాసరి? ఆలికి అన్నంపెట్టడం ఊరికి ఉపకారం అవుతుందా? మేం సుఖిస్తున్నామంటే మా సంసారం ఆనందంగా సాగిపోతున్నదంటే గుట్టుగా నిలవగలిగామంటే అందుకు కారణం ఆయనొక్కడే కాదు, నేను కూడాను. కాదని భార్యగల ఏపురుషుడయినా అనగలడా?

ఈ వాదనకి శంకరం వొప్పుకోక పోవటంతో వారి మధ్య తగవు వస్తుంది. తన వాదన నెగ్గాలంటాడు భర్త. తన అభిప్రాయాలు సరియైనవని వ్యాఖ్యానిస్తుంది భార్య. ఇదొక పెద్ద సమస్యయి కూచుంది వారిరువుర మధ్యాను. ఫైల్సు తిరగవేసేటప్పుడూ, ఉత్తరాలు టైపుచేసేటప్పుడూ, మేనేజరు చేత చీవాట్లు పడేటపుడూ, టైమయినా చేతిలోని వర్కు తెమలనపుడూ, శంకరానికి తన గొప్పదనం, కుటుంబానికి తనవల్ల కలిగే ఫలితాలు స్ఫురిస్తూవుంటవి. పొయ్యివద్ద పొగలో మాడుతూ రుచికరమయిన ఆహారాన్ని తయారుచేసేటపుడూ, మహా ఓపికతో అల్లరి పిల్లల్ని సముదాయించేటపుడూ, ఫర్లాంగు దూరంలో వున్న పంపువద్దనించి ఆయన స్నానానికికూడ నీళ్లు మోసేటపుడూ, పార్వతికి తన

సహనమూ, తన గొప్పదనమూ, తనవల్ల భర్తా బిడ్డలూ అనుభవించే సుఖమూ ఆనందమూ, జ్ఞాపకానికి వస్తూవుంటవి. ఇంతటి త్యాగము కుటుంబానికి తను చేస్తుంటే, ఇదేమీ గుర్తించకుండా అంతా నాదే, నేనే, నావల్లనే, అని మగవాడు అంటుంటే న్యాయం ఏముంది?

తన ఉద్దేశాలని మొండిగా పట్టుబట్టి పార్వతి ప్రతిఘటించటంతో ఆమె నెట్లాగయినా లొంగదీయాలని, తన గొప్పతనాన్ని ఆమె గ్రహించేలా చెయ్యాలని తను చేసే ప్రయత్నాలన్నీ పనిచేయక పోవటంతో ఆఖరికి ఒక నిశ్చయానికి వచ్చాడు శంకరం. ఆమెను కొన్నాళ్లు తననించి వేరుచెయ్యాలి. అప్పుడుగాని తనంతట తాను తెలుసుకొనగలిగే పరిస్థితికిరాదు. ఈ నిశ్చయం ఎప్పుడయితే కలిగిందో వెంటనే అది కార్యరూపంలో చూపటానికి ప్రారంభించాడు. తను అలాచేస్తే రాబొయ్యే ఫలితాలు ఏవిధంగా ఉంటవో శంకరం ఆలోచించలేదు. ఈ విషయంలో తను ఏమాత్రం తప్పటడుగు వేయకూడదనీ ఆమెపట్ల తన మనస్సును ఎంతమాత్రం మెత్తబడనీయకూడదని నిశ్చయించుకున్నాడు.

ఉదయాన్నే తను షేవ్ చేసుకోవటం పూర్తి అయేసరికి చంటిపిల్లవాణ్ణి చంకన ఎత్తుకుని చిరునవ్వుతో మామూలుగా పార్వతి కాఫీతీసుకువచ్చింది. కాఫీ అందించి చంటివాణ్ని అతనివద్ద కూర్చోపెట్టి వంటింట్లోనికి దారితీయపోయేసరికల్లా—

"పార్వతీ!" అన్నాడు ఆమెవైపు చూడకుండానే ఆగిపోయింది.


మద్రాసు అంగడి ఫోన్ : 2314 తంతి : "Balmo"

111, నైనియప్పనాయకన్ వీధి, మదరాసు.

ఆనందకరమైన దీపావళికి



నమ్మకమైన

కొళ్లేగాల్ బెనారెస్

పట్టు మరియు నూలు

బట్టలు లభించు స్థానము

S. R. B. ముత్తుకృష్ణ అయ్యర్

(పూర్వపు విలాసము :—S. R. బాలుస్వామి అయ్యర్ అండ్ సన్సు)

235, ఈస్టుమారెట్ వీధి, మధుర. తంతి : "Muthuco"

"ప్రయాణమవు, తొమ్మిది గంటల బండికి వెళ్ళాలి." పార్వతికి ఇదేమీ అర్థం కాక తెల్లబోయింది. క్షణం ఆలోచించి అంది.

"ప్రయాణం ఎక్కడికండీ?"

"మీవాళ్ళింటికి."

"మావాళ్ళింటికా?"

అన్నది మరింత సందేహంగా. అయినా అతని ధోరణి చూస్తే అది నవ్వుతాలుకంటున్న మాటలు కావని, అధికారపూరితమైన అతని గొంతు స్ఫురిస్తోంది.



చంటిదాని ప్రశ్నకు ఏంసమాధానం యివ్వాలో శంకరం మెదడుకు తట్టలేదు.

"అవును మీవాళ్ళింటికే. నీ బట్టలూ అవీ సద్దుకు ప్రయాణమవు."

తను తిరిగి ప్రశ్నించబోయింది. కాని అతను వినిపించుకోకుండా ఏమీ చలించకుండా స్నానానికి వెళ్ళిపోయాడు. లక్కపిడ తను ఏవిధంగా తినటమా అని ప్రయత్నిస్తూ అమాయకంగా ముద్దుగా తనను ఏమో ప్రశ్నిస్తున్నవాడిలా తన మోహంలోనికి చూస్తున్నాడు చంటివాడు. భర్త ఏ అభిప్రాయంతో మాట్లాడుతున్నాడో తనకి ఏమాత్రం స్ఫురించలేదు. ఇంత అర్జంటుగా తనని పుట్టింటికి పంపించాల్సిన అగత్యం ఏమొచ్చింది? తమ్ముడి పెళ్ళిసంబంధాలు వస్తున్నయ్యని నాన్న ఆమధ్య వచ్చినప్పుడు చెప్పాడు. ఒహవేళ అది ఏమయినా...తనకి తెలియకుండా ఉంటుందా? నాన్న స్వయంగా రాకుండా ఉంటాడా? తనకేమీ పాలుపోదు. ఆయన తన గురించి ఏమో మనస్సులో పెట్టుకుని యీవిధంగా చేస్తున్నారు. ఏ అపరాధానికి తననింత అకస్మాత్తుగా పంపించివేయుటము? ఆయనతోడ సాహచర్యం ప్రారంభించింది లగాయితు ఊహించలేని ఏ నేరమూ తను చేయలేదే.

ఆమె సమాధానం దొరకని ఆలోచనా పరంపరలో మునిగి తేలుతూ అక్కడే నిల్చొండిపోయింది. అంతవరకూ వీధిలో ఆడుకుంటున్న నాలుగేళ్ళ జానకి అన్నం పెట్టమంటూ సిద్ధమయి మారాం చేయసాగింది. పార్వతి పిల్లల్ని తీసుకు అక్కణ్ణించి నిష్క్రమించింది. శంకరం స్నానం పూర్తిచేసుకు బట్టలు ధరించి బయటికి వెళ్ళిపోయాడు.

నియమిత కాలానికి సరిగా పార్వతిని పిల్లల్ని బండీ ఎక్కించాడు. బండీ కదలటానికి ఇక కొన్ని నిమిషాలు మాత్రమే వ్యవధి ఉన్నది. పార్వతికి ఇదంతా ఓ ఇంద్రజాలంలా తోస్తున్నది. తాను అడిగిన అనేక ప్రశ్నలలో ఏఒక్క ప్రశ్నకేనా తాను సరియయిన సమాధానం పొందలేకపోయింది. తాను ఒంటరిగా ఇలా వచ్చినందుకు తనవాళ్ళంతా ఏమనుకుంటారు? తాను తన జీవితంలో ఒంటరిగా ప్రయాణం చేయటం ఇదే మొదటి దఫా. తనకిపుడు తన చంటి బిడ్డలే జత.

ఇక బండి కదులుతుందనే ఉద్దేశంతో అంత వరకూ తన వద్దనే ఉన్న జానకిని కిటికిలోంచి తల్లిప్రక్కనే కూర్చోబెట్టాడు.

"నాన్నా నువు రావ్!" అమాయకంగా మాటతో అడిగిన చంటిదాని ప్రశ్నకు ఏం సమాధానం ఇవ్వాలో శంకరం మెదడుకు తట్టలేదు. జానకి అంటే తనకెంతో ప్రేమ. కొన్నిక్షణాలు జానకి తనకి కన్పించకపోతే ఆతృతతో ఆవేదనతో తను బాధపడ్డ క్షణాలు ఎన్నోవున్నై. అట్లాంటి జానకిని విడిచి తాను ఉండగలడా? ఉండాలి. తప్పదు. పార్వతి గురించయినా తను ఓపిక పట్టాలి. ఆమె తనంతట తాను తెలుసుకోవాలి. తనకి క్షమాపణలు తెలుపుకోవాలి. తన మాటల్ని చులకన చేయటం మానివేయాలి. తన గొప్పదనం బాగా గ్రహించాలి. అంతవరకు ఆమెను తీసుకురాకూడదు.

బండి కదిలింది.

ఒక్కసారిగా పార్వతి తన మొహంలోనికి చూసింది. ఆమె కండ్లలోనుండి నీరు చెక్కులమీదుగా ప్రవహిస్తోంది. ఆమె మొహంలోనికి చూసేసరికి శంకరం హృదయం ఒక్కసారి వణికిపోయింది. తను తప్పుచేస్తున్నానేమో? ఏనేరానికి ఆమె నింతటి కఠిన పరీక్షకు గురిచేస్తున్నది? ఆమెను బండి నుండి దింపి తిరిగి ఇంటికి తీసుకుపోదామా అన్న మెరుపు తట్టింది. అది కేవలం మెరుపేఅయి వెంటనే అంతర్ధానమయింది. చూస్తుండగానే బండి కదలి వెళ్ళిపోయింది. కనుచూపులోంచికూడా తప్పిపోయింది. శంకరం నేరుగా వడెక్కిన శరీరంతో అక్కణ్ణించి ఆఫీసుకు వచ్చి వేశాడు. పనుల్లో ప్రవేశించాడు. తనకి తెలియకుండానే అనేక కొత్త సమస్యలు తనని ఎదుర్కొంటున్నట్లు ఫీలవుతాడు. ఆనాడు తనుచేసే ప్రతి పనిలోనూ తప్పులు వస్తున్నై. టైపురైటరుమీద వ్రేళ్ళు వణికినై.

ఆనాడు మేనేజరువల్ల పడిన చీవాట్లకు వెంటనే ఉద్యోగానికి రిజైన్ ఇద్దామనేంత ఉధృతం తనలో ఉత్పన్నమయింది. కాని తను యీ వుద్యోగంకోసం పడినపాట్లు, ఉద్యోగం వదలివేస్తే రాబోయ్యే పాట్లు బుర్రలో స్ఫురించేసరికి, చేసిన పొరపాట్లకు అధికారికి క్షమాపణలు చెప్పుకోవలసివచ్చింది.

బరువెక్కిన హృదయంతో అంతులేని ఆలోచనల్తో ఇంటిదారిపట్టాడు. అయితే యింటికి తాళం చూసిన తర్వాత గాని తను భోజనానికి హోటలుకు పోవాలన్న విషయం జ్ఞప్తికి రాలేదు. ఎనిమిది ఔన్సుల పేరుతో అందులో కొంత తగ్గించి రాళ్ళతోనూ, బెడ్డలతోనూ నిండివున్న అన్నం, గింజల పొగుతో వున్న ముదురువంకాయకూర, చెత్తా చెదారంతో కలగాపులగమయిన సాంబారు, ఎవరికయినా సరే రెండోపూటనించే అన్నహితవు తప్పించేట్టువుంటేసరికి పార్వతే ఆమె తయారుచేసిపెట్టే భోజనం స్ఫురణకొచ్చి అర్ధాకలితో అక్కణ్ణించి లేచిపోయాడు. అలా తను ఎన్ని పూటలు గడపాలో ఊహించబోయేసరికి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగినై. అక్కణ్ణించి మనశ్శాంతి కొరకు సినిమావేపు నడిచాడు. తెరమీద బొమ్మలు పరుగెడుతున్నయ్యేగాని తనకేం అర్థంకావటం లేదు. పార్వతిమీది తలంపులు తనని విడిచిపెట్టటం లేదు. మర్చిపోదామని ఎంత ప్రయత్నించినా మరపుకు రావటం లేదు. ఏమిటి ఆడవాళ్ళలో ఉన్న గొప్పతనం, ప్రత్యేకత? ఎందుకు వాళ్ళని గౌరవించాలి? వాళ్ళు లేకపోతే తనలాటి వాళ్ళకి సుఖం లేదా?

ఆనందం లేదా? ఇవే ప్రశ్నలు. తను చూస్తున్నాడు. మగవాళ్ల క్లాసులో అనేకమంది స్త్రీలు కలిసి కూర్చుని సినిమా చూస్తున్నారు. ఆడవాళ్లలో ఒక్క మగవాడూ కనుపించడేం? ఒకవేళ ఎవరయినా కూచుందుకు ప్రయత్నిస్తే బయటికి గెంటుతారు. రైల్లోనూ అంతే. ఏమిటీ దౌర్జన్యం? స్త్రీలకు ఈ ప్రత్యేకత ఎందుకివ్వాలి? అసలు తను పార్వతిని ద్వేషించటానికీ దీనికీ ఏమిటి సంబంధం? తన చుట్టూవున్న వాతావరణం ఎంత ప్రశాంతంగా వుంది. తనతోపాటు సినిమా చూస్తున్న ప్రక్క దంపతులు ఎంత ఆనందాన్ని అనుభవిస్తారు. పార్వతి కూడా తన ప్రక్కని కూర్చుని మధ్యమధ్య కథగురించి ప్రశ్నలు వేస్తుంటే తనకెంత ఆనందంగా వుండేది. ఒంటరిగా తను యీ ఆనందానుభూతిని అనుభవించలేడా? ఆనంద సుఖానుభవాలు తను పొందటానికి పార్వతి సహాచర్యం అవుసరమా? భార్య లేని తన జీవితము రాణించటానికి అవకాశాలు లేనే లేవా? పార్వతి! పార్వతి!! ఎంత ప్రార్థిస్తున్నా ఆమెనుగురించి వేధిస్తున్న భావాలు తననించి నిష్క్రమించవ్.

ఇంకా సినిమా ముగించనేలేదు. కళ్ళప్పగించి చూడటంతప్ప అదృశ్యాలు తనకేం అర్థంకావటంలేదు. అర్థంచేసుకోవాలన్నా తన మనస్సు అక్కడ లేదు. తనఆలోచనలు అపరిసరములోలేవు, తలనొప్పి, అర్థంకాని బాధ, స్ఫురించని ఆవేదన; హాలు విడిచిపెట్టి బయలుదేరాడు. కాళ్లు తిన్నగా ఇంటికితీసుకొచ్చినై. తాళంతీసాడు. ఇల్లంతా చీకటి, భయోత్పాతాన్ని కలిగిస్తున్నది. వెలవెల పోతున్నది. అగ్గిపుల్ల వేసి లైటు వత్తికి వెలిగించాడు. ఎంత పోరు పెడుతున్నా ఇంటివాడు కరెంటు వేయించడు. అద్దెలోమాత్రం ఎప్పటికప్పుడు ఒకటి రెండు పొడిగిస్తూనే ఉన్నాడు. అలా ఇచ్చుకుంటున్నా రోజారోజా ఇల్లు ఖాళీ చెయ్యమని ఏదో బెదిరింపే. ఉద్యోగమయినా దొరుకుతుందిగాని అమలాపట్నంలో ఇల్లుదొరకటమంటే మేరుపర్వతం లభించినట్లే.

దీపం కునుకుతోంది. కిరసనాయిలులేదులావుంది. అవును! కిరసనాయిల్ అయిపోయిందని పార్వతి తనతో వారం రోజులకు ముందుగానే చెప్పింది. ఇంతవరకు ఎట్లాగడుపుకొచ్చిందో ఆమెకే తెలియాలి. క్రమంగా దీపం ఆరిపోయింది. ఆ శూన్యగృహంలో ఆ అంధకారంలో తను వొంటరిగా ఎట్లాగడపగలడు. ఇరుగుపొరుగు సంసారులు పిల్లలతో కేరింతలాడుతూ కలకలలాడుతున్నారు. తన గృహంలో నిశ్శబ్దత తాండవిస్తోంది. ఏదో వెంగ భీభత్సం తనని ఆవరించుకున్నై. ఒకటే ఆలోచనలు, నిద్రపట్టదు. తెల్లవారేసరికితనకి తెలియకుండానే నూరుడిగ్రీల జ్వరం తనని ఆవహించింది. లేవటానికికూడ సాధ్యంకాని నీరసం అశక్తత వచ్చిపడింది. లీవురాసి ప్రక్కవాళ్లని బ్రతిమాలి ఆఫీసుకు పంపించాడు. మూడు రోజులవరకు తను అట్లు అవస్థపడుతూనే వున్నాడు. తనకి మంచి నీళ్లుకూడ ఇచ్చే దిక్కులేదు. ఆమధ్యాహ్నం ఒక మిత్రుడు వచ్చాడు చూసిపోవటానికి.

"ఏం బ్రదర్! ఏమిటి సమాచారం?"

లోనికి ప్రవేశిస్తూనే ప్రశ్నించాడు, తోటి ఉద్యోగి మిత్రుడుఅయిన రాము. నిద్రపోకపోయినా మంచంమీద పరుండి కనులుమూసుకుని ఆలోచిస్తున్న శంకరం పరిచయ గొంతును గుర్తించి లేచి కూర్చున్నాడు.

"ఏమిటి ఇంట్లో ఎవరు కనుపించరు."

"అవును. నాలుగు రోజుల క్రిందట ఊరికి వెళ్ళారు."

"మరి ఎవరు చూస్తున్నారు? నాకయినా కబురు పంపించక పొయ్యావ్. అయితే మందు ఏమి తీసుకుంటున్నావ్?

"ఏమీ తీసుకోలేదు."

"అయితే నాకు తెలియక అడుగుతాను. జ్వరం ఊరికే తగ్గుతుందా? మీవాళ్ళను ఎందుకు పిలిపించలేదు? ఎప్పుడొస్తారేం?"

"వాళ్లు ఎప్పుడొస్తారో తెలీదు. మందు తీసు కోవాలని అనుకుంటున్నాను."

"టెలిగ్రాం ఇవ్వమన్నావా?"


"వద్దులే. వాళ్ళే వస్తారు. నువ్వు మందు పంపించు."

"మంచివాడవు. ఎవరు చూస్తారు? ఎవరు చేస్తారు. కన్నతల్లిఅయినా వుండాలి. కట్టుకున్న భార్యఅయినా వుండాలి. పై వాళ్ళు ఎంతచేసినా ఆ దారి వస్తుందా? పైవాళ్ళు హృదయమిచ్చి చూడ గలరా? వెంటనే రప్పించు. నేను మందు తీసు కొస్తాను."

రాజు వెళ్ళిపోయాడు.

రాజు చెప్పింది నిజమేనేమో! తను ఆధారం లేని ఊహాలు మనస్సులో పెట్టుకొని పార్వతిపట్ల మూర్ఖంగా ప్రవర్తించాడు. పార్వతిని పంపించటం మూలంగా తను కొత్త ఇబ్బందుల్ని కోరి తెచ్చుకు న్నట్టయింది. ఇంటిలోని ప్రతి వస్తువూ పార్వతిలేని లోపాన్ని స్ఫురింప చేస్తున్నయ్. ఈ మూడు రోజుల్లోనే ఇల్లెంతో అసహ్యంగా కన్పిస్తున్నది. మూడు రోజుల్నుంచి తను జ్వరముతో బాధపడున్నా తనకి కాస్త కాఫీ కాచిపెట్టేవారే లేక పోయారు. పార్వతి ఉండగా తెచ్చిన నీళ్లు తప్ప మళ్ళా పంపునించి ఓబిందెడు నీళ్ళువ చ్చిన పాపానపోలేదు. ఎట్లా వస్తవి? పనిమనిషయినా ఉంటేకాసిన్ని తెచ్చిపోసేది. డబ్బు కష్టంగాఖర్చుపెట్టటం నేర్చుకున్న పార్వతి పని మనిషిని తగ్గించింది. తనకి నెలకి ఏడెనిమిది రూపాయలు మిగిల్చింది.

రాజు మందు పంపించి తను హోటల్నుంచి కాఫీ తెచ్చి ఇచ్చాడు. పార్వతిని పిల్లలను వెంటనే పంపించమని రాజు టెలిగ్రాం రాయించి తీసు కెళ్లాడు. టెలిగ్రాం రాసి పంపాడు. మళ్లా ఆలోచ నలు ఎదురుతిరిగినై. ఇంత తొందర్లోనే మళ్లా పార్వతిని రప్పిస్తే ఆమె దృష్టిలో తను మరింత చులకనై పోతాడేమో? ఆమె పంతాన్ని తాను మరింత బలపర్చినట్టు కాదా యీ తన చర్య? ఆమెను పంపించివెయ్యగానే పరిస్థితులన్నీ ఒక్కుమ్మడిగా ఎందుకు ఎదురు తిరగాల్సొచ్చింది? ఆమె తనంతట తాను తెల్సుకునేంతవరకూ దయ తల్చరాదని కదా తన నిర్ణయం! కాని ఆమె లేకుండా తను వెళ్ళ బుచ్చే ప్రతిక్షణమూ దుర్భరంగా ఉందే! ఇదెట్లా పరిష్కరించుకోవాలి? ఎందుకొరకయితే ఆమెను తను పంపించాడో, ఆమె వెళ్లటంతో అది తనకి బాగా అర్థమయింది. కాని పట్టుదల అనేది మాటి మాటికి తలయెత్తి కోపాన్ని రేకెత్తిస్తున్నది. మరు నాటి ఉదయానికి పార్వతి పిల్లలతో బండి దిగింది.



చంటివాణ్ణి యెత్తుకుని యింట్లోనికి ప్రవేశించింది.

జానకి బండి దిగగానే ఒక్క పరుగులో "నాన్నా" అంటూ లోనికి వచ్చింది. దిగులుపడిన మోముతో చంటివాణ్ణి ఎత్తుకుని ఇంట్లోనికి ప్రవేశించింది. శంకరం పడుకునే ఉన్నాడు. కొన్ని క్షణాలు అతని మొహంలోనికి చూస్తూ మౌనంగా నిలుచుండిపోయింది. ఆమె కండ్ల వెంబడి ఒకటి రెండు బొట్లు రాలినై. శంకరం పెదవులు వణికినై.

"పార్వతీ!"

పార్వతి బిడ్డతోసహా భర్తపై వాలిపోయింది.

ఏఁవిటి? మూడు రోజులకే ఇట్లా అయిపోయ్యారు. నిజంగా నేనెంత పొరపాటు చేసాను. మీరు పంపివెయ్యగానే నే వెళ్లి మీకు బాధ తెచ్చిపెట్టాను. నేను వెళ్లకుండా ఉంటే ఎంత బాగుండేది. పాపిష్టిదాన్ని."

ఏఁవిటి పార్వతేనా మాట్లాడుతున్నది?

"పార్వతీ, క్షమించు. నిన్ను పొరపాటుగా అర్థంచేసుకున్నాను. అన్నింటికీ నేనే కర్తనని, నేనే బాధ్యుడననీ పొరపడ్డాను. కాని నువ్వుకూడ భాగస్వామివి. అది గుర్తించక నిన్ను శ్రమపెట్టాను. నేను బాధపడ్డాను. నా ప్రవర్తనకు యీ నాలుగురోజులకే నువ్వెంత చిక్కావ్! నీ ముఖమెలా వాడిపోయిందో అద్దంలో చూసుకో!"

ఒక్కసారిగా పార్వతిని చంపలు తాకి ముద్దుగొన్నాడు. చంటివాడు కిలకిల నవ్వాడు. జానకి వీధిలోనికి పరుగెత్తింది.

మా ఖాతాదారులందరికీ శుభవార్త!

టెలిగ్రామ్: "చెన్నిన్"
కర్మాగారం: రంగూన్

గ్యారంటీతో మేము బర్మా ఫ్యాక్టరీ రంగూన్ కమలములను సప్లయ్ చేస్తాము.

ఒరిజినల్

రిజిస్టర్డ్ ఫిల్ మార్క్ వజ్రాలు రిజిస్టర్డ్

ప్రసిద్ధమైన

చెన్నీస్ వజ్రాలు

అన్ని పట్టణాలలోనూ షరాబు వ్యాపారులవద్ద దొరకును

చెన్నిరాధాకృష్ణ & కో., పెద్దబజారు, తిరుచునాపల్లి

"విక్టరి స్టార్ కమలములు"

(ఎక్స్ట్రా సూపర్‌ఫైన్ రకం)

CHENNI RADHAKRISHNA

BIG BAZAAR :: TRICHINOPOLY.